TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 123 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ గురువారం.27.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## పారదర్శకంగా సర్పంచ్ ఎన్నికలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె బుధవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, సీనియర్ అధికారులతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ ఎన్నికల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల వారీగా కేటాయించాలని సూచించారు. నేటి నుంచి ప్రారంభం కానున్న మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా.. నోటీసు జారీ, రిటర్నింగ్ అధికారిచే వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శనలో వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో ఉపేక్షించరాదనీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలని



పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు, సజావుగా, స్వేచ్ఛగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

సర్పంచ్ ఎన్నికల మొదటి విడతకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉదయం గ్రామ పోలింగ్ అధికారి ఎన్నికల నోటీసు జారీ చేసిన తర్వాత వార్డు, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.


## ఎయిరో స్పేస్..డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్



హైదరాబాద్ / శంషాబాద్ :అమృత్ తెలంగాణ: సాఫ్రన్ సంస్థ తన ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ, ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా%% బుధవారం హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్ఈజెడ్)లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ప్రధాని మోడీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ%% హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారిందని చెప్పారు. బెంగుళూరు-హైదరాబాద్ నగరాలను డిఫెన్స్, ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఎయిరోస్పేస్ రంగంలో, ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతోపాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. తెలంగాణపై ఎంతో నమ్మకంతో సాఫ్రన్ గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటరని సీఎం వివరించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌తోపాటు సాఫ్రన్‌కు చెందిన ఎం-88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్ హాల్‌కు శంకు స్థాపన చేయటం హర్షనీయమని అన్నారు. భారత వైమానిక దళం, నావికా దళానికి ఇది ఎంతో ఉపయోగపడుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాఫ్రన్ దాదాపు రూ.1,300 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణు లు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పెట్టుబడులను ఆహ్వానిం చడంతోపాటు పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింద ని పేర్కొన్నారు. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయని గుర్తుచేశారు. గత తొమ్మిది నెలల్లో ఎగుమతులు రూ.30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతు లను అధిగమిం చాయని తెలిపారు. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందిందని చెప్పారు.

రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై తమ ప్రభుత్వం దృష్టి పెడుతోందని సీఎం చెప్పారు. నైపుణ్యాలను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దామని వివరించారు. ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానా శ్రయం సమీపంలో 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వాని స్తున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. భారత లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ భాగస్వామిగా ఉండాలని ఆకాంక్షించారు. అదే క్రమంలో 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం వివరించారు. కార్యక్రమం లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ రాస్ మెకలెన్స్, సీఈఓ, డైరెక్టర్ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో స్టీఫేన్ క్యూయెల్, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావుతోపాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగం



న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం రాజ్యాంగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్ వేదికగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి కీలక ప్రసంగం చేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. తెలుగు, ఒడియా, అస్సామీస్, కాశ్మీరీ, బోడో, పంజాబీ, నేపాలీ, మరాఠీ, మళయాలం భాషల్లో ప్రచురించిన భారత రాజ్యాంగ గ్రంథం డిజిటల్ వర్షన్‌లను ఈ సందర్భంగా రాష్ట్రపతి విడుదల చేశారు. భారత్ కే సంవిధాన్ మే కళా ఔర్ కాలిగ్రఫీ శీర్షికతో ఒక స్మారక బుక్‌లెట్‌ను రిలీజ్ చేశారు.

రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట

ప్రజల స్వాభి మానాన్ని కాపాడే ఎన్నో హక్కులను రాజ్యాంగం దేశ ప్రజలకు ఇచ్చిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రాజ్యాంగం మనకు గొప్ప కర్తవ్య బోధ చేస్తోందని పేర్కొన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడంలో రాజ్యాంగమే మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. శాసనాల్లో ఎన్ని మార్పులు చేసినా రాజ్యాంగానికి లోబడి ఉన్నామన్నారు. రాజ్యాంగంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని, అందులో భాగంగానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకొచ్చినట్టు రాష్ట్రపతి చెప్పారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని, ఆర్థిక ఏకీకరణలో భాగంగా జీఎస్టీ వ్యవస్థను తీసుకొచ్చామని అన్నారు.

జాతీయతావాదం దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం

వలసవాద మనస్తత్వాన్ని త్యజించి, జాతీయతావాద ఆలోచనా వైఖరి దిశగా పౌరులను నడిపే గొప్ప గ్రంథం రాజ్యాంగం అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారు భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని రాష్ట్రపతి తెలిపారు. ఇటీవలి కాలంలో 25 కోట్ల మంది భారతీయులను దారిద్ర్య రేఖ నుంచి బయటికి తీసుకురావడం అనేది భారతదేశ గొప్ప విజయమని ఆమె కొనియాడారు.

ఇదే రోజు, ఇదే భవనంలో రాజ్యాంగం ఆమోదం

"1949 సంవత్సరంలో సరిగ్గా ఇదే రోజున (నవంబరు 26), ఇదే భవనం(రాజ్యాంగ సభ సెంట్రల్ హాల్) వేదికగా భారత ప్రజలు రాజ్యాంగాన్ని ఆమోదించారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, కొంతకాలం పాటు తాత్కాలిక పార్లమెంటుగానూ రాజ్యాంగ సభ సేవలు అందించింది. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మెన్‌గా బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ వ్యవహరించారు. ఆయనే మన రాజ్యాంగ ప్రధాన రూపకర్త. ఈ గొప్ప చారిత్రక సందర్భ వేళ మీ అందరి నడుమ ఉన్నందుకు నేను సంతోషిస్తున్నా. దేశ ప్రజల వ్యక్తిగత, ప్రజాస్వామిక హక్కులకు సదా రక్షణ లభించాలని భారత రాజ్యాంగ రూపకర్తలు కోరుకున్నారు" అని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రసంగించారు.

## రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్ ఉంటుందనీ, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం సీఎం ఒక్కరి నిర్ణయ ం కాదనీ, మంత్రివర్గ ఉపసంఘానిది అని మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉ ందన్నారు.

సర్కారు డ్రామా

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామనీ, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్టీపీసీ చెప్పిందన్నారు. అదే విధంగా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఎన్టీపీసీ, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్టీపీసీలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని




చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.

విద్యుత్‌ను అదానీ, అంబానీకి ఇచ్చేందుకు కుట్ర

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం తెస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. పథకాల కోసం ఒక డిస్కం ఏర్పాటు చేస్తే లాభాలు వచ్చే డిస్కంలను అంబానీ, అదానీలకు ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర జరుగుతున్నదని అన్నారు. ఆదాయమే రాని డిస్కంల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం డైరెక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి యాక్షన్ చేస్తున్నారని అన్నారు. త్వరలో హైదరాబాద్ అండర్ గ్రౌండ్ కేబుల్ స్కాం, పంపుడ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ స్కాం బయటపెడుతామన్నారు. త్వరలో రేవంత్‌రెడ్డి చేసే ఇంటర్ స్టేట్ స్కాంను ఆధారాలతో సహా బయటపెడతామని చెప్పారు. తాము ప్రతిపక్షంగా ప్రజల తరుపున ప్రభుత్వ స్కాంలు, అన్యాయాలపై ప్రశ్నిస్తే తమపై విచారణలంటూ బెదిరిస్తున్నారని అన్నారు. ఈ స్కాంలపై అవసరమైతే బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాకుంటే ఈ స్కాంలపై విచారణ జరపాలనీ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ బతికే ఉన్నాడా?

ఇస్లామాబాద్ :అమృత్ తెలంగాణ: జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను చూపించాలంటూ ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కుటుంబ సభ్యులు సైతం ఆయన్ని కలవడానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున నిరసనలు కూడా చేపట్టినట్టు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం నడుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. దీనంతటికీ ఇమ్రాన్ ఖాన్ జైల్లో మృతి చెందారనే వార్తలు బయటకు రావడమే కారణమని తెలుస్తోంది. కాగా, 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ ఖాన్ అడియాలా జైలులో ఉ న్నారు. అయితే, ఆయన్ను హతమార్చినట్టు సోషల్ మీడియాలో వార్తలు ప్రచారమయ్యాయి. దీనికి సంబంధించిన వార్తను బలూచిస్తాన్ విదేశాంగ శాఖ తమ ఎక్స్ ఖాతా లో పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ను హతమార్చినట్టు వార్తలు




వస్తున్నా యని అందులో రాసుకొచ్చింది. ఇంకా పలు మీడి యా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్టు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. మరోవైపు ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉ ండొచ్చనే వాదనలు కూడా వినిపిస్తు న్నాయి. కానీ, ఇప్పటి వరకు వీటిని ధ్రువీకరించేలా అధికారికంగా ఒక్క ఆధారమూ బయటకు రాలేదు.

# రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని అధికారులకు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుని హక్కులను కాపాడే మహత్తర పత్రంగా నిలిచిందన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగం మార్గదర్శకమని పేర్కొన్నారు. పౌరులందరూ రాజ్యాంగంలో ప్రతిపాదించిన మౌలిక హక్కులు, కర్తవ్యాలు తెలుసుకుని వాటిని ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఉద్యోగి రాజ్యాంగ విలువలను పాటిస్తూ పారదర్శకత, నిబద్ధతతో పనిచేస్తేనే మంచి పాలన సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా నిర్మించేందుకు ప్రతి పౌరుడు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్‌కుమార్, వివిధశాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి పంచాయతీ ఎన్నికలను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుండి పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ, జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామపంచాయతీలకు సంబంధించిన మొదటి విడత నామినేషన్లు రేపటి నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో మొత్తం 1408 పోలింగ్ కేంద్రాలు గుర్తించామని చెప్పారు. ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా జరిగేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కఠినంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల కోసం అవసరమైన పోలింగ్ సామాగ్రి ఇప్పటికే సంబంధిత మండల కేంద్రాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, ఆర్డీఓ స్రవంతి, డీఎల్పీవో ఫణిందర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో సమన్వయం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమీక్షా సమావేశంలో నిర్వహించారు ప్రజాస్వామ్య పండుగలా జరిగే ఈ ఎన్నికలను విజయవంతం చేయడం అందరి బాధ్యతగా కలెక్టర్ పేర్కొన్నారు. రేపటి (27.11.2025) నుంచి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు దశల్లో 18 మండలాల్లో జరగనున్నాయని తెలిపారు. ఎంసీసీ అమలు కోసం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనుమతుల మంజూరు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎం సి సి ఉల్లంఘనపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం పంపిణీ, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా వ్యవస్థ బలోపేతం, గ్రామ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. నామినేషన్ల నుంచి లెక్కింపువరకు ప్రతి దశలో పారదర్శక విధానాలు అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందుగానే చర్యలు చేపట్టాలని పార్టీ నాయకులూ సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ విలువను కాపాడే బాధ్యత అందరిపైనా ఉ ందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పరిపాలన, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేస్తే పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా పూర్తవుతాయని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైం సా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, డి పి ఓ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్, ఎంఐఎం మజర్, గాజుల రవి, పోశెట్టి, హైదర్, ఎన్నికల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాసేవ చేయాలి: అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెన్ గంగా భవన్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అధికారులకు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మార్గదర్శకం. ప్రతి పౌరుడు రాజ్యాంగంలో పేర్కొన్న హక్కులు, కర్తవ్యాలు తెలుసుకుని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్న ప్రతి ఉద్యోగి పారదర్శకత, నిబద్ధత, నైపుణ్యం వంటి రాజ్యాంగ విలువలను పాటిస్తేనే మంచి పాలన సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ అన్నారు. రాజ్యాంగం కాపాడే సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయన్నారు. అనంతరం

ఆమె అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్రంగా నిలుపుదలకు ప్రతి పౌరుడు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల పక్షాన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి







రాయికల్ అమృత్ తెలంగాణ నవంబర్ 26: మండలం కట్కాపూర్ గ్రామంలో గత 5 , 6 రోజుల నుండి వడ్లు జోకడం లేదు అని రైతులు జీవన్ రెడ్డి దృష్టికి తీసుకువెల్లగా వెంటనే స్పందించిన జీవన్ రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారుఉన్నత అధికారులతో ఫోన్ లో మాట్లాడిన జీవన్ రెడ్డి గత 5 , 6 రోజుల నుండి వడ్లు తూకం లేకుంటే రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు అధికారుల లోపంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది అని అన్నారు జగిత్యాల జిల్లాలో ఆ ఒక్క మిల్లు తోనే సమస్య ఎందుకు వేరే మిల్లు దొరకడం లేదా అని అడిగారు తూకం ఆగిపోవడంతో కూలీలు వెళ్ళిపోయేల ఉన్నారు అవసరం అయితే వేరే మిల్లుకు అలర్ట్ చేసి అయిన తూకం కొనసాగింపు చేయాలని అధికారులకు సూచించారు

## పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా పరిపాలన తీసుకున్న ఏర్పాట్లు, అనుసరించాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియాతో సమావేశం నిర్వహించారు.




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతం, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3 దశలలో ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, పోలింగ్ సామగ్రి పంపిణీ వంటి ప్రతీ అంశాన్ని మండల వారీగా సమీక్షిస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సూచనలు అందించినట్లు వెల్లడించిన కలెక్టర్, ఎన్నికల సంబందిత ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖతో సమన్వయం పెంచి తగిన భద్రతా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించడంలో ఎలాంటి రాజీ ఉండదని, ఉల్లంఘనలు గమనించిన వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశం లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఎఎస్పీ అవినాష్ కుమార్, డి పి ఓ శ్రీనివాస్, డిపిఆర్ఓ విష్ణు వర్ధన్, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో జీవితంపై విరక్తించింది వృద్ధుడు ఉరివేసుకొని మృతి..

### కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై గణేష్......


మృతి చెందిన ప్రభాకర్ ఫైల్ ఫోటో

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి నవంబర్ 26 అమృత్ తెలంగాణ, అనారోగ్య కారణాలవల్ల జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు మృతి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బైంసా లోని గోపాల్ నగర్ కు చెందిన గాయక్వాడ్ ప్రభాకర్, 60 అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం పరీక్షలు నిర్వహించగా కిడ్నీల,కు క్యాన్సర్ ఉ ందని తెలియడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంటి నుండి వెళ్లినాడు రాత్రి అయిన ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు బంధువులు మధ్యాహ్న వెతుకుచుండగా బుధవారం మధ్యాహ్నం సమయంలో నరసాపూర్ జి మండలంలోని నాసిరాబాద్ గ్రామ శివారులో గల ఫారెస్ట్ లో ఒక వ్యక్తి ఊరిపెట్టుకొని చనిపోయినాడు అని పశువుల కాపరులు తెలియజేయగా కుటుంబ సభ్యులు వచ్చి చూడగా తన తండ్రి అని . గుర్తుపట్టగా తన తండ్రి యొక్క కిడ్నీలు పాడై ఆరోగ్యం బాగాలేక ఆ బాధలో మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయినాడు అని తన కుమారుడు గాయక్వాడ్ ప్రవీణ్ తగు చర్య గురించి పోలీస్ స్టేషన్, నర్సాపూర్ యందు దరఖాస్తు ఇవ్వగా ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినారు.

## కొడైకెనాల్ లో పర్యటిస్తున్న అశ్వారావుపేట వ్యవసాయ విద్యార్థులు




అశ్వారావుపేట : సమగ్ర ఉద్యాన అభివృద్ధి తోనే జాతీయ ఆర్థిక పురోగతి ఉ ంటుందని కొడైకెనాల్ ఉద్యాన,అటవీ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సీ.రవీంద్రన్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం పరిధిలోని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఈ నెల 23 వ తేదీ నుండి డిసెంబర్ 3 వ తేదీ వరకు పదిరోజులు పాటు చేపట్టిన దక్షిణభారత విజ్ఞాన యాత్రలో భాగంగా 4 వ రోజు బుదవారం తమిళనాడు లోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన కొడైకెనాల్ ఉద్యాన పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1961 సంవత్సరంలో ఏపిల్ సాగు,అభివృద్ధి పై పరిశోదన చేసేవారు అని, 1971 సంవత్సరంలో హెచ్‌ఆర్ఎస్ (ఉద్యాన పరిశోదన స్థానం)గా అనంతర కాలంలో హెచ్ఎఫ్ఆర్ఎస్ ( ఉద్యాన,అటవీ పరిశోధనా స్థానంగా ) పురోభివృద్ధి చేసారని,దీని చరిత్ర,ఇందులో జరిగే పరిశోధనలు గురించి వివరించారు. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పియర్, ప్లమ్స్, పీచెస్,కివి వ్యాప్తిని విస్తరించడం,టెంపరేట్ హార్టీకల్చర్ క్రాప్స్ పైన పరిశోదన చేసే ఏకైక స్థానం అని తెలిపారు.ఇక్కడ లావేండర్, జిరానియమ్,రోజ్ మేరే, డ్వార్ఫ్ యూకలిప్టస్ వంటి ప్లాంటాగ్ పదార్థాలను పండిస్తున్నారు.ఇక్కడ వివిధ పరిశోధనలతో పాటు ఉద్యాన పండ్ల తోటల్లో చేసే యాజమాన్య పద్ధతులు,నర్సరీల పెంపకంపై శిక్షణ,యువత కు పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్షిప్ శిక్షణలు ఇస్తారు. ఆ తరువాత బ్రిటిష్ కాలంలో అభివృద్ధి చేసిన పైన్ అడవి ఇప్పుడు పర్యటక ప్రదేశంగా ఉంది. గుణ గుహలు వీక్షించారు. 102 మంది విద్యార్థులు పాల్గొనే ఈ విజ్ఞాన యాత్రకు టూర్ లీడర్ లుగా స్థానిక వ్యవసాయ కళాశాల బోధనా సిబ్బంది డాక్టర్ టీ. శ్రావణ కుమార్, డాక్టర్ కే. శిరీష్,డాక్టర్ శ్రీ జన్, స్రవంతి లు వ్యవహరిస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్ల పురోగతిని ఆమె సమీక్షించారు. నిర్మల్ కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని అంగసౌకర్యాలు సిద్ధం చేశామని తెలిపారు. రేపటి నుండి మొదటి విడత నామినేషన్లు ప్రారంభం కానుండగా, ఎన్నికలు పూర్తిగా నిష్పక్షపాతంగా జరిగేలా కఠినమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా ఎట్టి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకుని భద్రతా బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఎలాంటి రాజీ ఉండబోదని, ఉల్లంఘనలకు వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ కోసం అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, స్టేషనరీతో సహా అన్ని పోలింగ్ సామాగ్రిని ఇప్పటికే సంబంధిత మండలాలకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఎఎస్పీలు అవినాష్ కుమార్, రాజీవ్ మీనా, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్ DICCI జగిత్యాల. హాజరైన జగిత్యాల మున్సిపల్ కమీషనర్, ఘనంగా రాజ్యాంగ దినోత్సవం.





జగిత్యాల అమృత్ తెలంగాణ నవంబర్ 26: శతబ్దాల రాచపుండు అంటరానితనం, అస్పృష్యత పై బడుగు బలహీన వర్గాలు స్వతంత్రం పొందిన రోజు రాజ్యాంగ దినోత్సవం అని ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, హైదరాబాద్, DICCI జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళ్లు అర్పించాలని కోరారు. అంబేద్కర్ తన అనుభవాల నుంచి గొప్ప గొప్ప చదువులు, న్యాయ శాస్త్రంలో కోవిధుడుగా పేరు సంపాదించారని అన్నారు. ఆనాటి రోజుల్లో అంబేద్కర్ ల విద్యనభ్యసించిన వారు భారత దేశంలో ఎవరు లేరు. బ్రిటిష్ వారు మీ రాజ్యాంగం మీరే రాసుకోండి అని సూచించినారు. ఈ నేపథ్యంలో ఆనాటి భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ తో ఎన్నో విషయాల్లో విబేధించినారు. ముఖ్యంగా పునా ఓడంబడిక కమ్యూనల్ అవార్డు రద్దు చేయుటకు జరిగిన పరిస్థితులు ఉన్నప్పటికీ వారికి తప్పనిసరిగా అంబేద్కర్ ని రాజ్యాంగం బాధ్యతలు స్వీకరించాల్సిందిగా భారత జాతీయ కాంగ్రెస్ నాయకుల అభ్యర్ధనల మేరకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, రాజ్యాంగ సభలో క్లాజ్ వారీగా ఆర్టికల్స్ వారీగా సుదీర్ఘంగా చర్చించారు. ఆ సమయంలో అంబేద్కర్ ఒక న్యాయ కోవిడుదిగా, గొప్ప జ్ఞానిగా రాజ్యాంగ సభ అభివర్ణించిందని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం అమల్లో ఉ న్నన్ని రోజులు అంబేద్కర్ సజీవంగా అమరుడై ఉంటారని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే బడుగు బలహీన వర్గాలు ఆర్థిక రాజకీయ సామాజిక రంగల్లో అభివృద్ధి సాధించాలని మున్సిపల్ కమీషనర్ స్పందన ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 ఆదేశిక సూత్రాల్లో భాగంగా రాజ్యాంగం బలహీన వర్గాల, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల విద్య, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించాలి. సామాజిక అన్యాయం దోపిడీ నుండి వారిని రక్షించాలి అని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. అందుకే ప్రతి ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలను దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు రూపకల్పన చేస్తారని అన్నారు. అంబేద్కర్ ఎంతో శ్రమకు ఓర్చి దేశ విదేశాలు తిరిగి అన్ని రాజ్యాంగంలను క్రోడికరించి భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా అంశాలను చేర్చారని అన్నారు. భారత రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులు, రిజర్వేషన్స్ పక్షపాతం లేకుండా అమలు జరుగాలని అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘము రాష్ట్ర ఉ పాధ్యక్షులు నకుమల్ల నారాయణ డిమాండ్ చేశారు. బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన హక్కుల ద్వారానే రాజకీయ పదవులు, ఉద్యోగాలు మహిళలు, బడుగు బలహీన వర్గాలు పొందుతున్నారని దుమల రాజకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాయితి శ్రీనివాస్ జగిత్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, తక్కళ్ళ దేవయ్య మట్టిపూలు పత్రిక సంపాదకులు, ఆనంతుల కాంతారావు తెలంగాణ శక్తి ఎడిటర్, చిత్తారి ప్రభాకర్ మాలమహానాడు అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు,తోట జగన్ మాలమహానాడు అఫ్ ఇండియా జిల్లా ఉ పాధ్యక్షులు,నకుమల్ల లక్ష్మినారాయణ న్యాయవాది, కూర్మాచలం ఉమామహేష్ న్యాయవాది, కంచి సురేష్ న్యాయవాది,దుమాల రాజ్ కుమార్ మాజీ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్, దుమాల గంగాధర్ దళిత సంఘాల జిల్లా నాయకులు,జక్కుల చంద్రయ్య, సంకె మహేష్, కాయితి కిషన్, రాగం రమేష్ నేటి కేసరి జిల్లా స్థాపర్, దేవేందర్ నాయక్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్,రేగుంట గంగాధర్, సల్లూరి శోభన్ గౌడ్, దాసండ్ల కమలాకర్, కారాజుల అంజి,కాయిత శివ, నకుమల్ల నరేందర్,తదితరులు పాల్గొన్నారు.

# రౌడీలపై ఉక్కు పాదం

**అర్ధరాత్రి ఆకస్మికంగా రౌడీ షీటర్ల, సస్పెక్ట్ షీటర్ల ను పరిశీలించిన జిల్లా ఎస్పీ.**

**ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని సూచన.**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక.**

**పట్టణంలోని మహాలక్ష్మి వాడ, ఎస్సీ కాలనీ, శాంతినగర్ లలో ఉన్న రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లను ఆకస్మిక తనిఖీ**

**అర్ధరాత్రి 11 నుండి 1 వరకు స్పెషల్ ఆపరేషన్**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్**






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లా ప్రజలకు ప్రశాంత వాతావరణం శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా రక్షించడం పోలీసుల బాధ్యతగా అర్ధరాత్రి ఆకస్మికంగా రౌడీ షీటర్ల తనిఖీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ చేపట్టడం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల నుండి 1 గంటల వరకు ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కోడళ్లను మరియు పూరవీధులను సందర్శిస్తూ, ప్రజలకు సమస్యలు తెచ్చే రౌడీషీటర్ల, సస్పెక్ట్ షీటర్ లను తనిఖీ చేయడం జరిగింది. రౌడీలను, సస్పెక్ట్ లను పరిశీలించి వారి నేరచరిత్ర ప్రస్తుత, జీవనశైలి, ఉపాధి పరిస్థితులు, సామాజిక వ్యవహార ధోరణులపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సన్మార్గంలో ప్రయాణించాలని, తిరిగి నేరాలు చేయాలనే ఆలోచన వస్తే జైలు తప్పదని హెచ్చరించారు. పట్టణంలోని మహాలక్ష్మి వడ, శాంతినగర్, ఎస్సీ కాలనీ నందు గల రౌడీషీటర్ ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించి, వారిని తనిఖీ చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో సంచరిస్తున్న వారిని తనిఖీ చేసి మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న వారి వాహనాలను జప్తు చేయడం జరిగింది. అర్ధరాత్రి రోడ్లపై తిరిగే వారిని కట్టడి చేయాలన్నారు. రాత్రి సమయాలలో పోలీసు సిబ్బంది పటిష్టంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సీఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 8 మండలాల్లో 159 గ్రామ పంచాయతీలకు నామినేషన్ల స్వీకరణ..



సూర్యాపేట :అమృత్ తెలంగాణ: గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా సూర్యాపేట జిల్లాలో మొదటి విడతన 8 మండలాలలో 159 గ్రామపంచాయతిలు, 1442 వార్డ్ లకు గాను 44 నామినేషన్ కేంద్రాల ద్వారా నామినేషన్లు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదినికి తెలియజేశారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని హైదరాబాదు నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు ,ఎస్పీలు, పంచాయతీ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా సూర్యాపేట జిల్లాకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ వివరిస్తూ నామినేషన్ల స్వీకరణకు 44 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు, రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి విడత నామినేషన్లు ,ఎన్నికల కమిటీలు, ఇతర వివరాలకు సంబంధించిన అన్ని రిపోర్టులను టి పోల్ లో అప్లోడ్ చేశామని, అలాగే సమస్యత్మక,అత్యంత సమస్యత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను సమర్పిస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమాలని తు.చ తప్పకుండా అమలు చేసేందుకు అవసరమైన సిబ్బందిని, ఇతర నోడల్ టీములాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంసీఎంసీ, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. అంతకుముందు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుమిదిని జిల్లా కలెక్టర్ల తో మాట్లాడుతూ మొదటి విడత నామినేషన్లకు తీసుకున్న చర్యలు ,బందోబస్తు, రిసెప్షన్ కేంద్రాల వివరాలను అప్లోడ్ చేయటం, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, వివిధ రకాల కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై సూచనలు చేశారు.జిల్లా నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డి ఆర్ డి ఏ పి డి వి వి అప్పారావు, డివిజనల్ పిఓలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కి బుద్ది చెబుతాం

**బిసిలకు కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసింది**

**సర్పంచ్ లు గెలవాలని అయ్యప్ప స్వామి ఆలయాన్ని దర్శించుకోవడం జరిగింది**

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలను కాంగ్రెస్ నమ్మక ద్రోహం చేసిందని, 42% రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపి కొన్ని మండలాల్లో ఒక్క సీటు కూడా బిసి క్యాటగిరీ వారికి కల్పించలేదని మండిపడ్డారు. గతంలో ఉన్న 22% పాత రిజర్వేషన్లు కూడా తీసేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బిసిల పట్ల ప్రేమ లేదని కేవలం రాజకీయ పబ్బం గడపడానికే బిసి లకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని నమ్మబలికారని అన్నారు.

# రిమ్స్ డైరెక్టర్ ను కలిసిన మాల సంఘం నాయకులు




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ ఆధ్వర్యంలో పిడియాటిషన్ వార్డ్ లో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్, సింగరి అశోక్,బేర దేవన్న, పాశం రాఘవేంద్ర,మేదరి స్వామి బృందం స్వచ్ఛందంగా 10 చైర్స్ డొనేట్ చేయడం జరిగింది.

# జిల్లా స్థాయి బాలికల కబడ్డీ జూనియర్, సీనియర్ సెలెక్షన్స్




యాదగిరిగుట్ట :అమృత్ తెలంగాణ: యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట బుధవారం, ఆదర్శ యువజన మండలి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి బాలికల కబడ్డీ జూనియర్, సీనియర్ సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగం నుండి 14, సీనియర్ విభాగం నుండి మరో 14 మంది క్రీడాకారిణులు రాష్ట్రస్థాయికి సెలక్టు అయ్యారు. సెలెక్ట్ అయిన క్రీడాకారిణులు డిసెంబర్ లో జరిగే జూనియర్, సీనియర్ బాలికల కబడ్డీ, రాష్ట్ర స్థాయి క్రీడలలో యాదాద్రి భువనగిరి జిల్లా తరుపున పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అతిధి డివైఎస్ఓ ధనుంజయ్, జిల్లా కబడ్డీ అధ్యక్షులు గొంగిడి మహేంద్రరెడ్డి, హై స్కూల్ హెచ్ ఎం మల్లికార్జున్, జిల్లా కబడ్డీ అసోసియేషన్, అధ్యక్షులు పూల నాగయ్య, కోశాధికారి గంధమల్ల కుమార్, పి యి టి లు విజయ్, సురేందర్, చంద్రకుమార్, మనోహర్, రాము, శేఖర్, ఆదర్శ యువజన మండలి కార్యవర్గం, అధ్యక్షులు కటకం శ్రీనివాస్, కన్వీనర్ ఇరిటెపు శ్రీనివాస్, పాండు, కుమార్, సురేష్, భాస్కర్, యాదగిరి, బాలసిద్ధులు, సైదులు, బోలు, మహేందర్, రాజు, ప్రవీణ్, మల్లేష్, అశోక్, బాబు, సభ్యులు, యువకులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు: కలెక్టర్



నల్లగొండ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు ,ఎస్ పి లు, పంచాయతీ అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో గ్రామపంచాయతీ ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు, పిఓ,ఏపిఓ లకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా అన్ని రకాల కమిటీలను చైతన్యం చేయాలని, అవసరమైన బందోబస్తు ప్రణాళిక, సమస్యాత్మక , అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల సంఘానికి నివేదిక పంపించాలన్నారు. నోడల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఈనెల 27 నుండి స్వీకరించనున్న మొదటి విడత నామినేషన్ల సందర్భంగా ఆర్ ఓ ల తో తక్షణమే టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

# జన్నారం మండల సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు



జన్నారం :అమృత్ తెలంగాణ: జన్నారం మండలంలో 29 గ్రామ పంచాయతీలకు సంబంధించిన రిజర్వేషన్ వివరాలను ఎంపీడీవో ఉమర్ షరీఫ్ వెల్లడించారు. ఇందులో బాదం పెల్లి గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళ, బంగారు తండా ఎస్టీ జనరల్, చింతగూడ జనరల్ మహిళ, చింతలపల్లె బీసీ జన రల్, దేవునిగూడ ఎస్సీ జనరల్, దర్మారం ఎస్టీ మహిళ, హస్టల్ తండా ఎస్టీ జనరల్, ఇందన్పల్లి ఎస్టీ జనరల్, జన్నారం జనరల్ మహిళ, కలమడుగు జనరల్ మహిళ, కామన్పల్లి జనరల్, కవ్వాల్ ఎస్టీ జనరల్, కిష్టాపూర్, కొత్తపేట జనరల్, లింగయ్యపల్లె బీసీ మహిళ, లోతొర్రె ఎస్టీ జన రల్, మల్యాల్ ఎస్టీ మహిళ, మహ్మదాబాద్ ఎస్సీ జనరల్, మొర్రిగూడ ఎస్సీ మహిళ, మురిమడుగు జనరల్ మహిళ, పొన్కల్ జనరల్ మహిళ, రేండ్ల గూడ జనరల్ మహిళ, రాంపూర్ జనరల్, రోటి గూడ ఎస్సీ జనరల్, సింగరాయిపేట ఎస్సీ మహిళ, తపాలాపూర్ ఎస్సీ మహిళ, తిమ్మాపూర్ ఎస్టి మహిళ, తొమ్మిదిగుడిసెల పల్లె జనరల్, వెంకటా పూర్ జనరల్కు కేటాయించినట్లు ఎంపీడీవో తెలిపారు.

# ప్రభుత్వ రంగం సంస్థల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన ముగ్గురిపై కేసు, ఇద్దరి అరెస్ట్, రిమాండ్ - టూ టౌన్ సీఐ కె నాగరాజు

**నిరుద్యోగ యువత ఉద్యోగాల పేరుతో మోసం చేసేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.**
**కేర్ ఫౌండేషన్, సైన్స్ ఇన్నోవేషన్ పేరుతో వెలుగులోకి వచ్చిన సరికొత్త జాబ్ ఫ్రాడ్**
**పట్టణానికి చెందిన వ్యక్తి వద్ద నుండి లక్షల్లో డబ్బులు కాజేసిన నేరగాళ్లు.**
**పదుల సంఖ్యలో బాధితులు, 15 లక్షల వరకు మోసం**
**ఒక్కొక్కరి దగ్గర నుండి లక్ష నుండి లక్షన్నర వసూలు.**




అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్

నిందితుల వివరాలు.

1. ఎడ్ల చంద్రయ్య (45) s/o రామయ్య, హైదరాబాద్.
2. గెడం మనోజ్ (29) s/o ప్రకాష్, అదిలాబాద్.
3. సుజాత ఠాకూర్, హైదరాబాద్ (పరారి)

వివరాలలో

ప్రజలను ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరిస్తుందని టూ టౌన్ సీఐ కే నాగరాజు తెలియజేశారు.

ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం, పట్టణానికి చెందిన బాధితుడు మహమ్మద్ యాకూబ్, తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు రావాలని, కేర్ ఫౌండేషన్ సైన్స్ ఇన్నోవేషన్ పేరుతో కాంటాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గేడం మనోజ్ తనను సంప్రదించి, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, బాధితుని వద్దనుండి లక్షల్లో రూపాయిలు వసూలు చేసుకుని, మరొక నిందితుడు అయినటువంటి చంద్రయ్య కు అందజేశారు వీరు ఇరువురు కలిసి కమీషన్ తీసుకొని ప్రధాన నిందితురాలు సుజాతకు డబ్బులు అందజేసినట్లు తెలిపారు.

నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు.

పట్టణంలో 10 - 15 సంఖ్యలో బాధితులు ఉండవచ్చని కేర్ ఫౌండేషన్ ద్వారా మోసపోయిన బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు.

వీరు ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని బాధితుల వద్ద నుండి లక్ష నుండి లక్షన్నర వసూలు చేసినట్లు తెలిపారు.

ప్రజలు ఇలాంటి మోసగాళ్ల చేతిలో మోసపోకుండా ఉండాలని, చైతన్యంగా తెలివిగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు డబ్బులకు రావని, నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయబడతాయని గుర్తు చేశారు.

ఈ సంస్థ ద్వారా మోసపోయిన ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

సులువుగా డబ్బులు సంపాదించాలని అమాయకుల ఆశలతో, నిరుద్యోగుల భవితతో చలగాటమాడుతున్న నేరగాళ్లపై జిల్లా పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

# నూనె గింజల సాగుతో తేనెటీగల పెంపకంపై అవగాహన



కాటారం :అమృత్ తెలంగాణ: నూనె గింజల సాగుతో తేనె టీగల పెంపకాన్ని అనుసంధానించడం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని కాటారం మండల కేంద్రంలోగల మార్కెట్ కమిటీలో బుధవారం జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ (ఎన్.ఐ పి హెచ్ ఎం) ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం నవంబరు 20వ తేదీన ప్రారంభం కాగా 26 తారీకు బుధవారం ఆరు రోజులపాటు నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని జాతీయ తేనెటీగల బోర్డు (ఎన్ బి బి) మద్దతు ఇచ్చింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంసీ చైర్ పర్సన్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూనె గింజల సాగుతో తేనెటీగల పెంపకాన్ని అనుసంధానించడం ద్వారా పంట దిగుబడులు పెరగడమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని, తేనెటీగల పెంపకం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని అన్నారు.

ఉత్పత్తికి అనువైన ప్రదేశాలు, పంటల ఎంపికపై అనుభవం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి శక్తి వెల్, డాక్టర్ పైల జ్యోతి, శ్రీ నేచురల్ హనీ కరీంనగర్ వ్యవస్థాపకురాలు తాళ్లపల్లి సంజన పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

మల్హర్ రావు :అమృత్ తెలంగాణ: భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లేశ్వరి సూచన మేరకు డిహెచ్ఈడబ్ల్యూ,బిఆర్బి శక్తి విభాగాల సమన్వయంతో మండలంలోని వల్లెంకుంట ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా గుర్రం తిరుపతి తెలిపారు. ఆపదలో ఉన్న బాల బాలికలను రక్షించడం కొరకు ప్రభుత్వం కల్పించిన టోల్ ఫ్రీ నెంబర్ల 1098,181,1930, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేటి బాలలే రేపటి




పౌరులుగా నవ సమాజ నిర్మాణానికి నాంది కావాలని కోరుతూ “బాలల చదువు భవిష్యత్తుకు వెలుగు “కావున ఏ విద్యార్థిని విద్యార్థి బడిని మధ్యలోనే ఆపివేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనూష, మాధవి, ప్రసాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పస్రా సీఐ, ఎస్ఐ లు

గోవిందరావుపేట :అమృత్ తెలంగాణ: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ మొదటి విడత ఎలక్షన్ లలో భాగంగా పస్రా,గోవిందరావుపేట,చల్వాయి, దుంపెల్లిగూడెం మరియు కర్లపల్లి నామినేషన్ దాఖలు కేంద్రాలను బుధవారం పస్రా సీఐ పి దయాకర్, పస్రా ఎస్ఐ ఏ కమలాకర్ సందర్శించి నామినేషన్ కి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బంది కి తగు సూచనలు చేయడం జరిగింది. నామినేషన్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది కావున స్థానిక ప్రజలు నాయకులు గుంపులు గుంపులుగా ఉండకూడదని, నినాదాలు ధర్నాలు చేయకూడదని అన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని అన్నారు.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు


# జూ. అతిలోక సుందరి సమ్మోహనం



మరోవైపు జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి జాన్వీకపూర్ ప్రయాణం గురించి తెలిసినదే. జాన్వీ సౌత్ లోను వేవ్స్ క్రియేట్ చేస్తోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం అందుకుంది. దేవర లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తో ఘనమైన ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు మగధీర రామ్ చరణ్ సరసన క్రేజీగా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీలో నటిస్తోంది. ఈ సినిమాలో తనకు నటిగా నిరూపించుకునే ఆస్కారం బుచ్చిబాబు కల్పించాడని టాక్ వినిపిస్తోంది. షూటింగుల కోసం జాన్వీ హైదరాబాద్ కి వచ్చి వెళుతోంది. ఇటీవల ముంబై టు హైదరాబాద్ ప్రయాణాలతో బిజీ బిజీగా ఉంది.

# నీ వల్లే నీ వల్లే ఈ మాయే నీ వల్లే.. సిద్ శ్రీరామ్ మార్క్..!

మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఏది ప్రయత్నించినా సరే తెలుగు ఆడియన్స్ అలాంటి సినిమాలను భుజాన వేసుకుని సక్సెస్ చేస్తారు. కాన్సెప్ట్ సినిమాలకు ఉన్న డిమాండ్ అది. అందుకే కొత్త కథ ఉంటే చాలు దానికి తగినట్టుగా సినిమా వైబ్ ని క్రియేట్ చేసి దానికి తగిన ప్రమోషన్స్ ని చేస్తున్నారు. యువ దర్శకులు తమకు వచ్చిన ఛాన్స్ ని అన్ని విధాలుగా యుాజ్ చేసుకుంటున్నారు. ఇక అలాంటి యువతరం కథతో కొత్త పాయింట్ తో వస్తున్నారు త్రిబాణధారి బార్బరిక్. మోహన్ శ్రీవత్స డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. వశిష్ట ఎన్ సింహ, సత్యరాజ్, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, ఉదయ భాను ఇంపార్టెంట్ రోల్స్ లో నటిస్తున్నారు. త్రిబాణధారి బార్బరిక్ సినిమా మోషన్ పోస్టర్ ఫస్ట్ గ్లింప్స్ తోనే ఆడియన్స్ లో ఒక ఇంట్రెస్ట్ ని క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా నీవల్లే నీవల్లే అనే సాంగ్ రిలీజ్ చేశారు. రఘురాం లిరిక్స్ అందించిన ఈ సాంగ్ ను స్టార్ సింగర్ సిద్ శ్రీరామ్ ఆలపించారు. సిద్ శ్రీరామ్ పాట పాడితే ఆ మ్యాజిక్ ఎలా ఉంటుందో తెలిసిందే. దానికి ఏమాత్రం తగ్గకుండా ఈ సాంగ్ ఉంది. ‘తండేల్’ సాంగ్ వీడియో కూడా యూత్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉ



ంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాకు కుశేందర్ రమేష్ రెడ్డి కెమెరా మెన్ గా పనిచేస్తుండగా ఇంఫ్యూజన్ బ్యాండ్ ఈ సినిమాకు సంగీతం అందించారు. సినిమా టైటిల్ ఇంకా కాన్సెప్ట్ కొత్తగా ఉండేలా ఉంది కాబట్టి తెలుగు ఆడియన్స్ ఈ సినిమాను ఆకట్టుకునే ఛాన్స్ ఉంది. త్రిబాణధారి బార్బరిక్ టైటిల్ తోనే ఆడియన్స్ అటెన్షన్ రాబట్టిన మేకర్స్ సినిమా ప్రమోషన్స్ సాంగ్స్ తో మరింత బజ్ పెంచాలని చూస్తున్నారు. లేటెస్ట్ గా సినిమా నుంచి రిలీజైన సిద్ సాంగ్ మాత్రం మ్యూజిక్ లవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది.

# రేటు పెంచేసిన ఐశ్వర్యా రాజేష్

కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు సీనియర్ హీరో రాజేష్ కూతురిగా ఇండస్ట్రీలోకి అడుగపెట్టిన ఐశ్వర్యా రాజేష్ పేరుకే తెలుగమ్మాయి కానీ అమ్మడు ఎక్కువ తమిళ సినిమాలే చేస్తుంటుంది. కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనని తాను నిలదొక్కుకుంది. టాలీవుడ్ లో తెలుగమ్మాయిలకు ఛాన్సులివ్వరని, ఇచ్చినా నిర్మాతలు చాలా కండిషన్స్ పెడతారని అంటుంటారు. అందుకే ఐశ్వర్య కోలీవుడ్ వెళ్లి అక్కడ సినిమాలు చేసుకుంటూ సెటిలైంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండే ఐశ్వర్యా రాజేష్ తన తండ్రి లెగసీని తెలుగులో కంటిన్యూ చేయాలనుకుంది కానీ అనుకున్న విధంగా ఆమెకు



అవకాశాలు దక్కక కోలీవుడ్ కు వెళ్లి అక్కడ కెరీర్ ను స్టార్ట్ చేసి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తన టాలెంట్ తో దాదాపు 50 సినిమాల్లో నటించిన ఐశ్వర్యా రాజేష్,

# సూపర్ హాల్ లో నేహాశర్మ కైపెక్కిస్తుందే!



నేహా శర్మ అందాల సరాగాల గురించి చెప్పాల్సిన పనిలేదు. బ్యూటీ సామాజిక మాధ్యమాల్లో వెల్లువలా విరుచుకుపడుతుంది. ఇన్ స్టాగ్రామ్.. ట్విట్టర్ వంటి మాధ్యమాల్లో రెగ్యులర్ గా టచ్ లో ఉంటోంది. నిరంతర ఫోటోషూట్లతో సెల్ఫీ షూట్లతో హీటెక్కిస్తుంటుంది. గడిపేస్తోంది. యూత్లో ఎప్పటికప్పుడు చర్చకొస్తుంటుంది. రేర్ గా సిస్టర్ ఐశాశర్మతోనూ ఫోటో సెషన్స్ లో పాల్గొంటోంది. అక్కా-చెల్లి ఇద్దరు కలిసి అందాల దాడికి దిగారంటే? ఆ కథ వేరుగా ఉంటుంది. అయితే ఈసారి అంతటి సాహసానికి పూనుకోలేదు. నేహా శర్మ సోలోగానే అందాల విందు చేసింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com